నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ శనివారం 1 జూన్ 2024 | ADILABAD NIRMAL

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

డీఈవో రవీందర్ రెడ్డి


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో

నిర్మల్ అర్బన్, మే 31 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పార్ట్ -1, పార్ట్ -2 గా విభజించారని తెలిపారు. పార్ట్-1కు సంబంధించి దాదాపు 90 శాతం పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయని ఇప్పటికే పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలకు పంపిణీ చేయడం ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ పని చేస్తున్నదని, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

జైనథ్(బేల), మే 31 : అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతంగా గడువులోగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని, ఉర్దూ, మరాఠీ, తెలుగు పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిబాట, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్‌కు సూచించారు. రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అంతకుముందు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సవాయిసింగ్, గిర్దవార్ సాజిద్‌ఖాన్, వ్యవసాయాధికారి సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.


ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

# ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

● నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ● కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ఎదులాపురం/నిర్మల్ అర్బన్, మే 31 పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలను నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి పరిశీలించారు. లెక్కింపు కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్‌లో టేబుళ్లు సీసీ కెమెరాలు, మీడియా సెంటర్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. రౌండ్ల వారీగా ఫలితాలు, తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు కీలకమైన అంశామని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాజకీయ ప్రతినిధులు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది మీడియా ప్రతినిధులకు తాగునీరు, భోజన, వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఏజెంట్లు పెన్నులు, మొబైల్ ఫోన్‌లు, డిజిటల్ వాచ్‌లు, తదితర ఫొటోగ్రఫీ వస్తువులు తీసుకు రాకుండా చూడాలని, అనధికార వ్యక్తులను అనుమతించవద్దని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలు స్పష్టంగా తెలిసేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ఉట్నూర్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, జీవాకర్, రెవెన్యూ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవో ఖుష్బు గుప్తా

## ఆశ్రమాల్లో మరమ్మతులు పూర్తి చేయాలి

-ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, మే 31 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని పీవో ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవన్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమశాఖ అధికారులు, ఏటీడబ్ల్యూవోలు, ఏసీఎంవోలు, జీసీడీవోలు, క్రీడాధికారులు, పీఎంఆర్సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులను ఆశ్రమాల్లో చేర్పించడంపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులను ఇంటర్‌లో చేర్పించేందుకు కసరత్తు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీడీలు దిలీప్ కుమార్, రమాదేవి, గంగారాం, ఈఈ భీంరావు, జీసీసీ డీఎం రమానందం, అదనపు ఏజెన్సీ వైద్యాధికారి మనోహర్, ఎస్‌డీసీ గంగాధర్, ఏసీఎంవోలు జగన్, ఉద్ధవ్, రాజమౌళి, శివాజీ, క్రీడాధికారి పార్థసారథి, మీనారెడ్డి, జీసీడీవో ఛాయాదేవి, శకుంతల, జీవరత్నం ఉన్నారు.

### సులువైన పద్ధతిలో విద్యను బోధించాలి

విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యను బోధించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా సూచించారు. శుక్రవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో వికాసం పాఠశాలలో నిర్వహించిన పిల్లల సందడి వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆట, పాటలతో నేర్పిన విద్యను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోలేరని తెలిపారు. విద్యతో పాటు డ్రాయింగ్ నేర్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఆమె వెంట నీతి అయోగ్ సీపీవో రాహుల్, పీఎంఆర్సీ, ఆర్పీఎం గోవింద్‌రావు, ప్రిన్సిపాల్ వికాస్, భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు

## నిబంధనలు కచ్చితంగా పాటించాలి

● ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ ● ప్రైవేట్ దవాఖాన వైద్యురాలికి నోటీస్


ప్రైవేట్ దవాఖాన వైద్యురాలికి నోటీసు అందజేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం,మే31: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ దవాఖానాల వైద్యులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని శివప్రియ నర్సింగ్ హోమ్‌ను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో(మాతా శిశు సంరక్షణ కార్యక్రమ అధికారి) సాధనతో కలిసి తనిఖీలు చేశారు. దవాఖానకు సంబంధించిన రికార్డులు, పరిశీలించారు. లింగనిర్ధారణ నిషేధ చట్టం, ఎంటీపీ యాక్ట్ అమలు, సాధారణ ప్రసవాలపై పలు సూచనలు చేశారు. దవాఖానకు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో నోటీసు జారీ చేశామన్నారు. పలు లోటుపాట్లను గుర్తించి, మరోసారి జరగకుండా చూసుకోవాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఐడీఎస్పీ అధికారి డాక్టర్ అశోక్, మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# అస్తిత్వంపై కక్షెందుకు ?

**అధికార చిహ్నం మార్పుపై కాదు.. హామీల అమలు, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలి**

● కాంగ్రెస్ సర్కారు తీరు మారకపోతే మరో ఉద్యమం ● సీఎం రేవంత్‌రెడ్డి చర్యలపై భగ్గుమంటున్న మేధావులు, కవులు, ఉద్యమకారులు




నిర్మల్, మే 31(నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వాన్ని కనుమరుగు చేసే కుట్ర చేస్తున్నారని మేధావి వర్గంతోపాటు కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులు మరోసారి పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అధికార చిహ్నంలో మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తుండడంపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర చిహ్నంలోని చార్మినార్‌ను, కాకతీయ కళా తోరణాన్ని తొలగించేందుకు యత్నించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాలు, గొలుసు కట్టు చెరువులు ఎన్నో ఉన్నాయి. 'జయజయహే తెలంగాణ' గీతంలో కూడా పలు మార్పులు చేయడమే కాకుండా, ఆ గీతానికి పొరుగు రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంగీత దర్శకుడితో సంగీతం సమకూర్చుతుండడంపై తెలంగాణ వాదులు మండిపడుతున్నారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లను రాచరికపు ఆనవాళ్లు అని రేవంత్‌రెడ్డి అనడం బట్టి ఆయనకు చరిత్రపై ఏమాత్రం అవగాహన ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాపాలనపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేసి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే మార్పులు తేవాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ అధికార చిహ్నంలో చరిత్రాత్మక కట్టాడాలను తొలగించడం మానుకోవాలని, రాష్ట్రీయ గీతం విషయంలో తప్పిదం చేయవద్దని, లేదంటే మరో మిలియన్ మార్చ్, సాగరహారం, వంటావార్పు లాంటి నిరసన కార్యక్రమాలతో ఉద్యమిస్తామంటూ మేధావులు, ఉద్యమకారులు, తెలంగాణ వాదులంతా ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నారు.

### చిహ్నంపై కాదు..అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



*కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇలాంటి రాజకీయాలను పక్కన పెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు అధికార చిహ్నాన్ని మార్చాల్సిన అవసరం ఏముంది..? రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నంలో కాకతీయ కళా తోరణం కచ్చితంగా ఉండాలి. ఎందుకంటే కాకతీయ రాజుల కాలంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందడమే కాకుండా, కళలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా వారి పాలన నిలిచింది. అప్పట్లోనే తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చెరువులు తవ్వించారు. హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రానికి ఆయువుపట్టు. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికంగా రాష్ట్రానికి కీలకమైన పట్టణం హైదరాబాద్. హైదరాబాద్ అంటే చార్మినార్ అని దేశమంతటికి తెలుసు. అలాంటి చార్మినార్‌ను చిహ్నం నుంచి తొలగిస్తామనడం మంచిదికాదు. ఈ రెండు చిహ్నాలు అలాగే ఉంచాలి.*

**-డాక్టర్ అప్పాల చక్రధారి, తెలంగాణ రచయితల వేదిక సలహాదారు, నిర్మల్**

### ఇప్పటికే టీఎస్‌ను టీజీగా మార్చి ప్రజలను అయోమయానికి గురి చేశారు



*కాకతీయ కళా తోరణం, చార్మినార్ మన తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకలుగా ఉన్నాయి. తెలంగాణలోని మహా నగరాలైన హైదరాబాద్, వరంగల్ రెండు పట్టణాలను ప్రతిబింబించేలా వాటితో గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అధికార చిహ్నాన్ని రూపొందించింది. అప్పట్లో దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో వాటిని తొలగించి కొత్త చిహ్నాన్ని రూపొందిస్తామనడం సమంజసం కాదు. వాటిని తొలగిస్తే మన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని మనమే పోగొట్టుకున్నట్లు అవుతుంది. ఈ రెండు చిహ్నాలతో పాటు బతుకమ్మ, యాదాద్రి ఆలయాల గుర్తులను ప్రస్తుత చిహ్నానికి జత చేస్తే బాగుంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం కరెక్టు కాదు. ఇప్పటికే టీఎస్ ను టీజీగా మార్చి రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. గుర్తులను మార్చడం కాదు.. రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిది.*

**-డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, నిర్మల్**


విత్తనాల గోదాంలో తనిఖీలు చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


గోదాంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

# అక్రమ నిల్వలపై నిఘా

● విత్తనాల గోదాంల వద్ద పర్యవేక్షణ బృందాలు ● రైతులకు విత్తన కొరత లేకుండా చర్యలు ● తనిఖీలు నిర్వహించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్, మే 31 ( నమస్తే తెలంగాణ) : పత్తి విత్తనాల అక్రమ నిల్వలు, రవాణాపై అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లాలో ఆర్‌సీహెచ్ 659 విత్తనాల కొరత నేపథ్యంలో రైతులకు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పత్తి, ఇతర విత్తనాలను సీజన్‌కు ముందుగానే డీలర్లు బుక్ చేసుకుంటారు. ఆ మేరకు ఆయా కంపెనీలు విత్తనాలను సరఫరా చేస్తాయి. వాటిని డీలర్లు గోదాంలలో నిల్వ ఉంచి విక్రయిస్తుంటారుడిమాండ్ ఉన్న విత్తనాలను డీలర్లు అక్రమంగా నిల్వ ఉంచడం, విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడాన్ని నివారించి వాటిని రైతులకు సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డీలర్లకు సంబంధించిన 36 గోదాంల వద్ద రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారుల బృందాలు పర్యవేక్షించనున్నాయి. విత్తనాల పంపిణీ పూర్తయ్యే వరకు ఈ బృందాలు గోదాంల వద్ద షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తాయి. గోదాంలలో విత్తనాల డీలర్లు నిల్వ ఉంచిన స్టాక్‌ను రైతులకు పంపిణీ అయ్యేలా బృందాలు విధులు నిర్వహిస్తాయి.

### నకిలీ విత్తనాల నిరోధానికి చర్యలు

నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉండడంతో అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాల రాకుండా ఏర్పాట్లు చేశారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన శంకర్‌గూడ, ఘన్‌పూర్, లక్ష్మీపూర్, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. జిల్లాలోని విత్తనాల దుకాణాలను సైతం పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

### తనిఖీలు నిర్వహించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ జిల్లాలోని పలు విత్తనాల డీలర్లకు చెందిన గోదాంలలో శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం తనిఖీలు నిర్వహించారు. విత్తనాల నిల్వలు, రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాల, ఎరువుల గోదాం వద్ద రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బందిని నియమించి గోదాంల నుంచి విత్తనాలను అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 55 కంపెనీలకు చెందిన 128 రకాల 14.40 లక్షల పత్తి ప్యాకెట్లు అందుబాటులో ఉండగా ఇప్పటి వరకు 4 లక్షల విత్తనాల ప్యాకెట్లను రైతులు కొన్నట్లు వివరించారు. ఇంకా 6.40 లక్షల ప్యాకెట్లు అమ్మే అవకాశాలున్నాయన్నారు. రైతులకు కోరుతున్న ఆర్‌సీహెచ్ రకానికి డిమాండ్ ఉందని గతేడాది 1.20 లక్షల ప్యాకెట్లు విక్రయించగా ఈ ఏడాది 1.50 లక్షల ప్యాకెట్లు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 60 వేల ప్యాకెట్లను విక్రయించగా మిగతా విత్తనాలను సీజన్‌కు ముందుగానే రైతులకు అందజేస్తామని తెలిపారు. మిగతా కంపెనీలకు చెందిన సర్టిఫైడ్ విత్తనాలను సైతం వినియోగించాలని రైతులకు సూచించారు.

### బేల మండల కేంద్రంలో తనిఖీ

జైనథ్(బేల), మే 31 : బేల మండల కేంద్రంలోని మార్కెట్‌లోని ఎంఎస్ నిలేశ్ విత్తన షాపును కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. డీలర్లకు పలు సూచనలు చేశారు.

### ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు

-ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మే 31: విత్తనాల అక్రమ రవాణాను అక్రమ నిల్వలను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు, ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని విత్తన గోదాములను పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గోదాముకు విత్తనాలను తీసుకువచ్చిన, రవాణా చేసిన సమయాలు, తేదీ, పేరుతో నమోదు చేయాలని డీలర్లకు ఎస్పీ సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలతో పాటు ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, సీఐలు కే సత్యనారాయణ, ఏ.అశోక్, సిబ్బంది ఉన్నారు.

## పొగాకుతో అనారోగ్యం

-నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, మే, 31 : పొగాకు వాడితే గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని నిర్మల్ డీఎం హెచ్‌వో ధన్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్మల్ పట్టణంలో బస్తీ దవాఖానలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకు వాడకంతో ఇబ్బందులు, అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధూమపానం, పొగాకు వాడకం నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో ఉప వైద్యాధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి వేణురావు, ఆప్తాలమిక్ అధికారి లక్ష్మీకాంత్, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### ధూమపానంతో క్యాన్సర్

-డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం, మే 31: ధూమపానంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, ధూమపానం చేసే యువకుల సంఖ్య పెరిగిందని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ధూమపానం కారణంగా అనారోగ్యం పాలై 80 లక్షల మందికి పైగా మరణిస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 374 మంది శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో 482, నోటి క్యాన్సర్‌తో 520, టీబీ వ్యాధితో 198 మంది బాధపడుతున్నారని గుర్తుచేశారు. పొగాకు వాడడంతో జరిగే అనర్థాలను విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 13 పాఠశాలలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించామని, త్వరలో మిగతా వాటిని కూడా నో స్మోకింగ్ జోన్‌గా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో వైసీ.శ్రీనివాస్ , అడిషనల్ డీఎంహెచ్‌వో గజానన్, ఎన్‌సీడీ అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్, తదితరులు ఉన్నారు.



నిర్మల్ చైన్‌గేట్: ప్రతిజ్ఞ చేస్తున్న నిర్మల్ డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది